# ఏసీబీ వలలో చిక్కిన టౌన్ ప్లానింగ్ సర్వేయర్

## సర్వే రిపోర్టు ఇచ్చేందుకు రూ.50,000 లంచం తీసుకుంటూ దొరికిన వైనం.



తాడేపల్లిగూడెం, మార్చి 17 ( ప్రభాత వార్త) :ఏసీబీ వలలో మరో అవినీతి చేప చిక్కుకుంది. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో ఏసీబీ వరుస దాడులు చేస్తున్న నేపథ్యంలో తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఉద్యోగి 50,000 లంచం తీసుకుంటూ ఉండగా ఏసీబీ అధికారులకు పట్టుబడటం మంగళవారం చోటుచేసుకుంది. జిల్లావ్యాప్తంగా మున్సిపాలిటీల్లో టౌన్ ప్లానింగ్ విభాగాల్లో అవినీతి పేరుకుపోయిందని పలుమార్లు ప్రభాతవార్త వార్తలు ప్రచురించింది. ఈ క్రమంలో తాజాగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ విభాగంలో చక్రం తిప్పుతున్న పెద్ద చేపను ఏసీబీ అధికారులు టార్గెట్ చేశారు భూమిని కొలవడానికి సరిహద్దులు గుర్తించడానికి లే అవుట్లను నిర్ధారించడానికి కొలతలు వేసేందుకు నాకెంత, రిపోర్టు ఇవ్వడానికి నాకు ఎంత అంటూ అవినీతి సొమ్ము కూడబెట్టుతూ వస్తున్న తాడేపల్లిగూడెం పొరపాలక సంఘం సర్వేయర్ రౌతు రామకృష్ణ లంచం సొమ్ముతో ఏసీబీ అధికారులకు చిక్కారు. ఎంతోకాలంగా సర్వేయర్ రౌతు రామకృష్ణ పై అవినీతి ఆరోపణలు ఉన్నాయి భూ సర్వేలకు అందుకు సంబంధించిన సర్వే రిపోర్ట్ ఇచ్చేందుకు భూ యజమానుల నుంచి పెద్ద మొత్తంలో సొమ్ము డిమాండ్ చేసే వారనే ఆరోపణలు ఎప్పటినుంచో వినవస్తున్నాయి. భూ యజమానులు తమ పనులు త్వరితగతిన చేయించుకునేందుకు సర్వేయర్ రామకృష్ణ అడిగింది ఇవ్వక తప్పని పరిస్థితి దీంతో ఆయన ఉద్యోగం కొలతలు కొద్ది లక్షలు కొద్దీ కొనసాగుతోంది. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన కడకట్లలో కమ్ముల రాధకు 1800 చదరపు గజాలు స్థలం ఉంది. ఆమే ప్రస్తుతానికి ఏలూరులో నివాసం ఉంటుంది. తన స్థలానికి చెందిన సర్వే రిపోర్ట్ కావాలని సర్వే రామకృష్ణను పలుమార్లు అడిగి చూసింది. అడిగిన ప్రతిసారి ఏదో ఒక సాకు చెబుతూ రోజులు గడుపుతూ వచ్చారు. ఈ క్రమంలో రాధ తాడేపల్లిగూడెం చెందిన ఒక వ్యక్తిని ఆశ్రయించింది సర్వే రిపోర్ట్ అందుకు కెనడి అనే వ్యక్తి సర్వేయర్ రౌతు రామకృష్ణతో మాట్లాడగా రిపోర్టు ఇవ్వడానికి రూ 50 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో కెనెడి ఏలూరు ఏసీబీ అధికారులను సంప్రదించారు. మంగళవారం సర్వేయర్ ఇంట్లోనే లంచం ఇస్తుండగా ఏసీబీ డి.ఎస్.పి జీవి కృష్ణారావు ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్లు ఎం బాలకృష్ణ కే శ్రీనివాస్ ఇతర అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం ఎసిబి అధికారులు రామకృష్ణ ఇంటిని కార్యాలయాన్ని సోదా చేశారు. రామకృష్ణను అరెస్టు చేసి విచారణ అనంతరం రాజమండ్రి రిమాండ్ కు తరలిస్తారని తెలిసింది.

# రాష్ట్రస్థాయి మ్యాథ్స్ పరీక్షలో 28 మంది ఎంపిక.




లింగపాలెం మండలం మార్చి 17 ప్రభాతవార్త : శ్రీవిద్యా హై స్కూల్ ధర్మాజీగూడెం నందు జనవరి 30 వ తేదీన జరిగిన లిటిల్ చాంప్స్ కాంపిటేషన్ వారు స్టేట్ లెవెల్ నిర్వహించిన మ్యాథ్స్ పరీక్షలో 105 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షలలో జష్వ. జాషువా (7వ తరగతి) స్టేట్ 1 వ ర్యాంక్, ఖ. శివమణికంఠ (8వ తరగతి) స్టేట్ 4 వ ర్యాంక్, వివేక్ జోవిన్ (6వ తరగతి) స్టేట్ 8 వ ర్యాంక్, సాయి అక్షర (3వ తరగతి) స్టేట్ 10 వ ర్యాంక్ సాధించారు. స్టేట్ లెవెల్ లో 500 లోపు 28 మంది విద్యార్థులు ర్యాంక్ సాధించారు. ఈ కార్యక్రమం ఈ నెల 8 వ తేదీ ఆదివారం నాడు ఏలూరు ౹ూ౦ ఫంక్షన్ హాల్ లో నిర్వహించి స్టేట్ లెవెల్ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు ఏలూరు నియోజకవర్గ మీరూ బడేటి. రాధ కృష్ణయ్య (చంటి) గారు మరియు అడిషనల్ ఎస్పీ సూర్య చంద్రరావు గారు క్యాష్ ప్రైజ్, మెమెంటో, సర్టిఫికెట్స్ అందచేశారు. ఈరోజు స్కూల్ లో జరిగిన కార్యక్రమం లో పాల్గొన్న విద్యార్థులను మరియు స్టేట్ లెవెల్ లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జష్వ. రత్నాకర్ రావు గారు, మ్యాథ్స్ ఇంచార్జ్ రమ్య, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# సిబ్బంది లేక గ్రామ సచివాలయాలు వెలవెల

**- మండలంలో అన్ని సచివాలయాలలో ఇదే పరిస్థితి**

**- ప్రజలకు పనులు కాక అవస్థలు**




ప్రభాతవార్త, చాట్రాయి : చాట్రాయి మండలంలో గ్రామ సచివాలయలలో గత కొన్ని నెలలుగా సిబ్బంది లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు ఏ పని కావాలన్నా స్థానిక సచివాలయాలకి వెళ్లాల్సి ఉండగా సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన సేవలు పొందడానికి వచ్చిన ప్రజలు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా వృద్ధాప్య పించన్లు, రైస్ కార్డులు, విద్యుత్ బిల్లులు, ఇంటి పన్నులు, పొలం శిస్తులు కట్టాలన్న సిబ్బంది లేకపోవడంతో వెనుతిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకోవడానికి వచ్చే వారి బాధ వర్ణనాతీతంగా మారింది. ఇటీవల సచివాలయ సిబ్బంది బదిలీలపై వెళ్ళగా చాట్రాయి మండలంలోని సచివాలయాలకు సిబ్బంది కోరుకోలేదు అని తెలుస్తోంది. ఇక్కడి నుండి బదిలీ అయిన సిబ్బంది మాత్రం ఆయా ప్రాంతాలకు వెళ్లి జాయిన్ అవ్వగా ఇక్కడ చాలామంది సిబ్బంది జాయింట్ కాలేదు. దీంతో మండలంలో ఏ సచివాలయానికి వెళ్ళినా వెలవెల పోతున్నాయి. కోటపాడు గ్రామ సచివాలయంలో ప్రస్తుతం ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్, ఏఎన్ఎం మాత్రమే ఉన్నారు.ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయం ఇలా ఖాళీగా ఉండడం సరైనది కాదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా సచివాలయాలపై దృష్టి సారించి సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# పశువులకు టీకాలు వేయించుకోండి

## - తెలుగు రైతు నేత మోరంపూడి



చాట్రాయి, మార్చి 17, ప్రభాతవార్త : రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకుని పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నూజివీడు నియోజక వర్గ తెలుగు రైతు అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాస రావు సూచించారు. మంగళవారం చాట్రాయి మండలం, చనుబండ గ్రామంలో ఎల్ ఎస్ ఏ ఆధ్వర్యంలో రైతుల గేదెలకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయడం ప్రారంభించగా అయన పాల్గొని మాట్లాడుతూ పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించడం వల్ల పాడి పశువుల్లో వ్యాధిని నిరోధించి, పాల ఉత్పత్తి తగ్గకుండా క్రమబద్ధీకరించవచ్చు అని చెప్పారు. అంతేకాకుండా దూడల్లో మరణాలను నివారించి, అవి ఆరోగ్యంగా ఎదిగేలా చేయవచ్చు అని నాలుగు నెలల వయస్సు దాటిన ప్రతి ఆవుకు, గేదెకు తప్పని సరిగా టీకా వేయించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు నెక్కళపు వెంకటేశ్వర రావు, బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బుర్రి శ్రీకర్, చనుబండ గ్రామ కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొత్తగుండ్ల రమేష్, మోదుగు ముత్తయ్య, ఎల్ ఎస్ ఏ పవనకుమారి, గోపాలమిత్ర వెంకటేశ్వర రావు, ఏ హెచ్ ఏ హరిక్రిష్ణ, రైతులు పాల్గొన్నారు.

# టిటిడి చైర్మన్ రాజీనామా కోరుతూ

## భీమవరంలో వైఎస్సార్ సిపి నిరసన



భీమవరం టౌన్,మార్చి17 : ప్రభాతవార్త :టిటిడి చైర్మన్ బి ఆర్ నాయుడు రాజీనామా చేయాలని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలో వైఎస్ ఆర్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. స్థానిక ప్రకాశం చౌక్ వద్ద నుండి టూ టౌన్ తాడేపల్లి గూడెం రోడ్ లో కల అంబేద్కర్ విగ్రహం వరకూ పార్టీజెండాలతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. తిరుపతిలో శాంతియుతంగా నిరసన చేపట్టిన తమ పార్టీ వారిపై దాడి చేయడం అమానుష మన్నారు, పైగా వారిపై ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయటం వారి నైతికతకు నిదర్శ నమన్నారు. పవిత్రమైన, ప్రతిష్టాత్మకమైన టీటీడీ చైర్మన్ పదవికి నాయుడు అర్హుడు కాదని, వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో బీఆర్ నాయుడి శృంగార లీలల ఉదంతం పై ఆయన బసచేసిన హోటల్ దగ్గర టీటీడీ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని శాంతియుత నిరసన చేపట్టిన తిరుపతి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై టీడీపీ గూండాలు దాడి చేయడమే కాకుండా వారిపై ఎస్ సి,/ఎస్ టి కేసులు నమోదు చేశారని , ఆకారణంగా భీమవరంలో నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు పార్టీ నాయ కులు తెలిపారు. జిల్లా అధ్యక్షులు ముదు నూరు ప్రసాద్ రాజు , నరసాపురం పార్ల మెంట్ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణంరాజు , ఎంఎల్ సి కవురు శ్రీనివాస్, ఉండి నియోజకవర్గ సమన్వయ కర్త పి.వి.ఎల్ నరసింహ రాజు ,భీమవరం నియోజకవర్గ సమన్వ యకర్త చినమిల్లి వెంకట్రాయుడు , తాడేపల్లిగూడెం నియోజకవర్గ సమన్వయ కర్త వడ్డీ రఘురాం , పార్లమెంట్ సెక్రటరీ లు ఎడ్ల తాతాజీ , పేరిచర్ల విజయ నరసింహ రాజు , ఎ ఎస్ రాజు , మరియు వివిధ హోదాలో ఉన్న ముఖ్య నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల స్థాయి శిక్షణ



అత్తిలి,మార్చి 17( ప్రభాత వార్త )అత్తిలి మండల ప్రజాపరిషత్ కార్యాలయం లో ఎంపీపీ మక్కా సూర్యారావు, ఎంపీడీఓ పి.శామ్యూల్ అధ్యక్షతన మండల స్థాయిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మక్కా సూర్యరావు మాట్లాడుతూ రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ వార్షిక కార్యాచరణ అమలులో గ్రామపంచాయతీయులు 9 అంశాలలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. డిప్యూటీ ఎంపీడీఓ లు జీవి వి సత్యనారాయణ, కె సీతారామరాజు , మండలములోని యం.పి.టి.సి సభ్యులు, ఉప సర్పంచ్ లు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు,గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులుతదితరులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ తల్లి ఆలయ పునః నిర్మాణ కమిటీ

అత్తిలి, మార్చి 17 (ప్రభాత వార్త) అత్తిలి రామన్నపేటలో గల ముత్యాలమ్మ తల్లి ఆలయ పునః నిర్మాణం కోసం కమిటీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గల ఆలయం చిన్నదిగా ఉండటంతో పూజాది తదితర కార్యక్రమాలు నిర్వహణకు అసౌకర్యంగా ఉండటంతో విశాలమైన ఆలయాన్ని నిర్మించడానికి రామన్నపేట ప్రాంతీయులు నిర్ణయించారు. అందులో భాగంగా ఆలయ పునర్నిర్మాణం కోసం కొరిపల్లి హరి, దాసరి రామారావు,గొర్రెల వెంకట్రావు,దాసరి నాగరాజు, సలుమూరి వెంకట్రావు తదితరులు కమిటీగా ఏర్పడి ఈనెల 28న ఆలయ పునర్నిర్మాణం కోసం శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి రావాల్సిందిగా తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ తదితర ప్రముఖులను ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# మందార పువ్వులు అలంకరణలో శ్రీ అభయాంజనేయ స్వామి దర్శనం



పెనుమంట్ర, మార్చి 17, (ప్రభాతవార్త): మండలంలోని మార్టేరు జెడ్ వంతెన వద్ద కొలువైన శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి మందార పువ్వులతో ప్రత్యేక అలంకరణ చేసి తెల్లవారుజాము నుంచే భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా హనుమాన్ యువజన సేవా సంఘం సభ్యుడు కర్రీ అచ్యుత రామారెడ్డి మాట్లాడుతూ ప్రతి మంగళవారం స్వామివారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి కొనసాగుతోందన్నారు. అర్చకులు విజయగోపాలాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన కమిటీ సభ్యులు, భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఒత్తిడి లేని విద్యను విద్యార్థులకు అందించాలి



నూజివీడు, మార్చి 17 ప్రభాతవార్త: ఒత్తిడి లేని విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు నేర్పాలని , అప్పుడే ప్రభుత్వం కలలగొన్న విజన్ 2047 సాధ్యమవుతుందని నూజివీడు డివిజన్ పాఠశాల విద్యాశాఖ అధికారి పిఎస్ సుధాకర్ రావు అన్నారు. మంగళవారం నూజివీడు ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జరిగిన నూజివీడు డివిజన్ ఆన్ ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్లు సమావేశంలో అధ్యక్షత వహిస్తూ ప్రసంగించారు విద్య అనేది ఆహ్లాదకర వాతావరణంలో అందమైన తరగతి గదుల్లో విద్యార్థులకు అందించాలన్నారు అలాంటప్పుడే మానసిక శారీరక వికాసం ఏర్పడి సమాజ హితం కోసం దేశ గౌరవం కోసం పాటుపడే విద్యార్థులు తయారవుతారని ఆయన అభిప్రాయపడ్డారు డివిజన్ లో ఉన్న అన్ని ప్రైవేటు పాఠశాలలువచ్చే విద్యాసంవత్సరం నుంచి విలువలతో కూడినటువంటి ప్రభుత్వ లక్ష్యాలతో పని చేయవలసి ఉందని దానికి అధికారులతో కలిసి కరస్పాండెంట్లు కలిసి పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు ఈ సమావేశంలో నూజివీడు మండల విద్యాశాఖ అధికారి ఎం .దేవ వరప్రసాద్ , ముసునూరు మండల విద్యాశాఖ అధికారి సుబ్బారావు తో పాటు వివిధ పాఠశాల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

# 19న ఉగాది వేడుకలు .. 70 మంది సేవాతత్పరులకు ఉగాది పురస్కారాలు

భీమవరం మర్చి 17 ప్రభాతవార్త : మన సంస్కృతి సంపద మన పండుగలని, మన సాంప్రదాయాలు యుగాంతం వరకు చెరగని ముద్రలని శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్, ఉగాది వేడుకల అధ్యక్షులు కంతేటి వెంకటరాజు, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. మంగళవారం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 19వ తేదీన భీమవరం శ్రీభీమేశ్వర స్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలను నిర్వహిస్తున్నామని, ఈ వేడుకల్లో సుమారు 20 రంగాలకు చెందిన 60 మంది విశిష్ట సేవాతత్పరులకు ఉగాది పురస్కారాలు, 10 మంది ప్రముఖులకు సన్మానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ప్రముఖ కవి తెన్నేటి లక్ష్మి నరసింహ మూర్తి రచించిన తెలుగు లోకం పుస్తక ఆవిష్కరణ, పంచాంగ శ్రవణం, పలు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దేవస్థాన కార్యదర్శి కుక్కల బాల, వేడుకల సభ్యులు అరసవల్లి సుబ్రమణ్యం, నందమూరి రాజేష్ మాట్లాడుతూ గత 36 ఏళ్లుగా వివిధ సేవాతత్పరులకు ఉగాది పురస్కారాలను అందిస్తున్నామని, ముందుగా డప్పుల వాయిద్యాలతో మేళా తాళాలతో పూర్ణ కుంభంతో ఉగాది శోభాయాత్ర జరుగుతుందన్నారు. భక్తులందరూ ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. ఈ వేడుకలను కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎంపీ పాక సత్యనారాయణ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ నాగరాణి తదితర ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు.

# స్వర్ణాంధ్ర లో ఆటో ఎక్స్‌పోతో జాతీయ స్థాయి హ్యాకథాన్ ఘనంగా ప్రారంభం



నరసాపురం రూరల్ ప్రభాతవార్త :నరసాపురం మండలం, సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (AIML), మెకానికల్ ఇంజినీరింగ్ మరియు రోబోటిక్స్ విభాగాల ఆధ్వర్యంలో, ప్రపంచ ప్రఖ్యాత ఇంజినీరింగ్ సంస్థ ఏఐఎంఎల్ మద్దతుతో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి హ్యాకథాన్ కార్యక్రమం మంగళవారం వివిధ రకాల కస్టమైజ్డ్ వాహనాల ఆటో ఎక్స్‌పోతో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.వి. సత్యనారాయణ, ట్రెజరర్ కె. వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, యాజమాన్య సభ్యులు టి.వి.వి. ప్రసాద్, ఎస్. కీర్తి కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎ. గోపిచంద్, విభాగాధిపతి డా. బొమ్మ రామకృష్ణ, మెకానికల్ విభాగాధిపతి డా. ఫ్రాన్సిస్ లూథర్ కింగ్, కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యాలు మరియు సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందించడం ఈ హ్యాకథాన్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఇందులో పాల్గొని , మెకానికల్ ఇంజినీరింగ్ మరియు రోబోటిక్స్ రంగాల్లో కొత్త ఆలోచనలు, ప్రాజెక్టులను అభివృద్ధి చేసే అవకాశాన్ని పొందనున్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (APSCHE) చైర్మన్ ప్రొఫెసర్ కె. మధు మూర్తి, ఎస్. గణేష్ ఆసియన్ హెడ్), డా. అనిల్ కుమార్ (ప్రిన్సిపాల్) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రతినిధులు జి. నందగోపాల్ (మెంటర్), ఎల్. అశ్వాత్ (సాఫ్ట్‌వేర్ ఇంజినీర్), డా. సుశాంత్ కుమార్ సాహూ (సాఫ్ట్‌వేర్ ఇంజినీర్), డా. వి. శివరామన్ (ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్) ఈ హ్యాకథాన్ నిర్వహణలో పాల్గొంటున్నారు. ఈ హ్యాకథాన్ నిర్వహణలో ఏఐఎంఎల్ విభాగాధిపతి డా. బొమ్మ రామకృష్ణ, డా. ఫ్రాన్సిస్ లూథర్ కింగ్ ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సమన్వయకర్తలుగా డా. రావి లలిత నారాయణ, డా. జి. సుధాకర్, డా. పి.ఎస్.ఎన్. రాజు, ఆర్.వి. మణికంఠతో పాటు ఇతర అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమ నిర్వహణలో పాల్గొంటున్నారు. ఈ హ్యాకథాన్ రెండు రోజులపాటు నిర్వహించబడుతుంది.

# జనార్ధనవరంలో రైతన్న మీకోసం



చాట్రాయి, మార్చి 17, ప్రభాతవార్త : చాట్రాయి మండలం జనార్ధనవరం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చాట్రాయి మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు మాదాసు చంద్రకళ, జనార్ధనవరం గ్రామటిడిపి పార్టీ అధ్యక్షుడు మాదాసు చిన్న పుల్లయ్య నీటి సంఘం అధ్యక్షుడు వంగల సుబ్బారావు, బూత్ ఇంచార్జ్ బూత్ ఇన్చార్జి రామారావు, గ్రామ జనరల్ సెక్రెటరీ రాచకొండ కృష్ణ,వంగల రమేష్,కొనకాల శ్రీనివాసరావు, కొనకాల శివయ్య, లక్ష్మీనారాయణ మాదాసు వెంకటనారాయణ, బండారు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రజలు ముందుకు రావాలి



పెనుమంట్ర, అత్తిలి, మార్చి 17, (ప్రభాతవార్త) :"కన్నీళ్లు కాదు... కన్నెర్ర చేద్దాం" అంటూ సమస్యలపై పోరాటానికి ప్రజలు ముందుకు రావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి. గోపాలన్ పిలుపునిచ్చారు. సిపిఎం నిర్వహిస్తున్న జిల్లా ప్రజా చైతన్య పాదయాత్ర మంగళవారం నాటికి 20వ రోజుకు చేరుకుంది. పాలమూరు నుంచి ప్రారంభమైన ఈ యాత్ర బ్రాహ్మణ చెరువు, పెనుమంట్ర, జుత్తిగ, మల్లిపూడి మీదుగా అత్తిలి మండలంలోని పాలి, అత్తిలి వరకు కొనసాగింది. పెనుమంట్రలో కె. అమ్మాజీ అనే మహిళ తన బాధను వ్యక్తం చేస్తూ కన్నీళ్లు పెట్టుకుంది. 55 ఏళ్లుగా అద్దె ఇళ్లలోనే జీవనం సాగిస్తున్నామని, భర్తకు స్థిరమైన ఉపాధి లేదని, అద్దెలు కూడా కట్టలేని పరిస్థితి వచ్చిందని వాపోయింది. "చావునైనా సొంతింట్లో జరగాలి" అనే తన ఆకాంక్ష నెరవేరాలని కోరింది. పేదలకు ఇళ్ల నిర్మాణం ప్రభుత్వం చేపట్టాలని విజ్ఞప్తి చేసింది.

దళితుల సమస్యపై ఆగ్రహం

పెనుమంట్ర రాజీవ్ కాలనీలో దళితులకు స్మశాన వాటిక లేకపోవడంపై సిపిఎం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా మరణిస్తే పూడ్చిపెట్టడానికి సరైన స్థలం లేక అవమానకర పరిస్థితులు ఎదురవుతున్నాయని స్థానికులు తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె. క్రాంతిబాబు మాట్లాడుతూ, "బ్రతికిన వాళ్లు నడవలేని దారిలో చనిపోయిన వారిని తీసుకెళ్లడం ఘోర అవమానం" అని అన్నారు. ఈ సమస్యపై తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఎమ్మార్వో రవికుమార్ స్పందించి, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జే.ఎన్.వి. గోపాలన్ మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలు తమ సమస్యలను కన్నీటి రూపంలో వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రతి కన్నీటి బొట్టుకు పాలకులు సమాధానం చెప్పాల్సిందేనన్నారు. సమస్యలు పరిష్కరించాలంటే ప్రజలు ఐక్యంగా పోరాడాలని, ఈనెల 23న భీమవరం కలెక్టరేట్ వద్ద జరిగే ముగింపు సభకు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్రలో సిపిఎం జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్మశాన వాటిక అభివృద్ధి పనులు ప్రారంభం



మొగల్తూరు మార్చి 17 (ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం కాళీపట్నం తూర్పు పంచాయతీ పరిధిలో ఉన్న స్మశాన వాటిక అభివృద్ధి పనులు ప్రభుత్వ విప్ మరియు శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ చొరవతో ఎన్ జి ఆర్ ఎస్ నిధులు 10 లక్షల రూపాయలతో క్రియేషన్ బోర్డు షెడ్డు నిర్మాణం చేయడం జరుగుతుంది మంగళవారం ఈ స్మశాన వాటికకు 10 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే నాయకర్ కు గ్రామస్తులు స్థానికులు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు

# యదేచ్ఛగా చెరువులు తవ్వకాలు పట్టించుకోని అధికారులు



మొగల్తూరు మార్చి 17 (ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం రామన్నపాలెం పంచాయతీ పరిధిలో మొగల్తూరు నుంచి పసలదీవి వెళ్లే రహదారిని అనుసరించి ఉన్న పంట పొలాలను యదేచ్ఛగా ఆక్వా చెరువులు గా తవ్వుతున్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన స్థానిక రైతులు ఉన్నత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలను ఆక్వా చెరువులుగా మార్చడం వల్ల చుట్టుపక్కల వరి పొలాలు రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని దీనిపై ఉన్నత అధికారులు స్పందించి చర్య తీసుకోవాలని ఆక్వా చెరువుగా మార్చడానికి పర్మిషన్ ఇచ్చేటప్పుడు చుట్టుపక్కల రైతుల అంగీకారం కూడా పరిగణలోకి తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

# పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే బొలిశెట్టి



తాడేపల్లిగూడెం, మార్చి17 (ప్రభాత వార్త): పెంటపాడు మండలంలోని కాగులంపాడు మండల ప్రజా పరిషత్ పాఠశాలను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతోసంభాషించారు. భోజనాల్లో నాణ్యత, పరిశుభ్రత, పాఠశాలలో మౌలిక సౌకర్యాలు, విద్యాబోధన, తదితర అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ భోజనం చేసి ఆహార పదార్థాల రుచి, నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించటానికి ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంపన నరసింహారాజు, అంగన్వాడి సూపర్వైజర్ చెరుకూరి భవాని, పుల్లా బాబి, చెరుకూరి చంద్రశేఖర్, అమెరికా రాజు, రాయిప రెడ్డి మారుతి, చాపల రమేష్, మద్దాల మణికుమార్, పిడుగు రామ్మోహన్ బ్రదర్స్, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ఎంతో అమూల్యమైనవి

## పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు




తాడేపల్లిగూడెం, మార్చి17 (ప్రభాత వార్త) : పట్టణ పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు ఎంతో అమూల్యమైనవని పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు సూచించారు. స్వచ్ఛభారత్ -స్వచ్ఛ తాడేపల్లిగూడెం -స్వచ్ఛ సర్వేక్షన్లో భాగంగా పారిశుద్ధ్య కార్మికుల సామర్థ్య నిర్మాణ శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ పట్టణ ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా పారిశుద్ధ్య కార్మికుల అహోర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ మనందరి భాధ్యత అని తెలిపారు. కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పారిశుద్ధ్యం విషయంలో పట్టణాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని తెలిపారు. శానిటేషన్ వర్కర్స్ ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, పురపాలక సంఘం అందించిన గ్లవ్స్, షూస్, మాస్కులు, యేప్రాన్‌లను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. అనంతరం శానిటేషన్ వర్కర్స్‌కు గ్లవ్స్, షూస్, మాస్కులు, యేప్రాన్‌ల వినియోగం, ఫార్స్ ఎయిడ్, ఆరోగ్యం, ఆహారం వంటి విషయాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర జిల్లా కో ఆర్డినేటర్ రాహుల్ , శానిటేషన్ ఇన్స్పెక్టర్ లు, సానిటేషన్ సెక్రటరీలు, పురపాలక సంఘంలోని పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.